క్లుప్తంగా...

మేడిపల్లిలో గజం రూ.63 వేలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లిలో హెచ్ఎండీఏ స్థలాలకు సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో అనూహ్య స్పందన లభించింది. చదరపు గజానికి అప్‌సెట్ ధర రూ.32 వేలుగా నిర్ణయించగా అత్యధికంగా గజానికి రూ.63 వేల వరకు డిమాండ్ రావడం గమనార్హం. ఎక్కువ శాతం గజానికి రూ.58,730 చొప్పున అమ్ముడయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మొత్తం ప్లాట్‌లలోని 15,000 చదరపు గజాల స్థలాన్ని విక్రయించారు. రూ.48 కోట్ల వరకు ఆదాయం రావొచ్చని అంచనా వేయగా అనూహ్యంగా రూ.88.1 కోట్ల ఆదాయం వచ్చినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

గుమ్మడిదల వెంకటేష్ సస్పెన్షన్


మాట్లాడుతున్న మహేష్ తదితరులు

మేడ్చల్: మండలంలోని రాజబొల్లారం గ్రామ బీఆర్ఎస్ యూత్ కమిటీ ఉపాధ్యక్షుడు గుమ్మడిదల వెంకటేష్‌ను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తెలిపారు. గ్రామ బీఆర్ఎస్ కమిటీ సమావేశం నిర్వహించి వెంకటేష్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. వెంకటేష్ పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ నారాయణగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తాం


పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్ రాములు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఆస్తి పన్నులను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేయాల్సి వస్తోందని మేడ్చల్ కమిషనర్ రాములు హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ పరిధిలో పన్నుల వసూల కోసం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఆయన పాల్గొని పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మేడ్చల్ మున్సిపాలిటీలో రూ. 11 కోట్ల పన్నుల చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.4 కోట్లు వసూలు చేశామన్నారు. మొండి బకాయిల వసూళ్ల కోసం 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌కు చెందిన లబ్ధిదారులకు మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వార్డుకు చెందిన అనసూయకు రూ.60 వేలు, అబ్బుపతక్‌కు రూ.49,500, లతకు రూ.60 వేలు మంజూరు కావడంతో చెక్కులను మంత్రి మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తుడుం గణేష్, దయానంద్‌యాదవ్, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

కొర్రెముల్ గ్రామంలో..

ఘట్‌కేసర్: అనారోగ్యం కారణంగా కొర్రెముల్ గ్రామానికి చెందిన దేవేంద్ర ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందగా సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.36 వేలు మంజూరయ్యాయి. కాగా అందుకు సంబంధించిన చెక్కును రాజుముదిరాజ్‌తో కలిసి సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ దేవేంద్రకు అందజేశారు. ఎంపీటీసీ వినోద, వార్డు సభ్యుడు ఆంజనేయులు, సత్యనారాయణ ముదిరాజ్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 5వ డివిజన్ మల్లికార్జుననగర్‌కు చెందిన ఉపేందర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.35 వేల చెక్కును సోమవారం కార్పొరేటర్ ఏకే మురుగేష్ బాధితుడి కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో సిద్దులు యాదవ్, ఆనంద్, లక్ష్మీ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


అజయ్‌కుమార్

జవహర్‌నగర్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాప్రా ఎల్లారెడ్డిగూడలోని నివసించే అల్లం బుచ్చయ్య కుమారుడు అల్లం అజయ్‌కుమార్(25) ప్రైవేటు ఉద్యోగి. గత నెల 25వ తేదీన తెలిసిన వారి వద్ద డబ్బులు తీసుకుని ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


నిందితుడు రామ్

జవహర్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రాములు వివరాల ప్రకారం.. కాప్రా జమ్మిగడ్డలో నివసించే తుంగపిండి రామ్(20) గంజాయి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఇంటిపై దాడి చేయగా 300 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రామ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మరో నిందితుడు శంకర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇక నుంచి.. వృద్ధులూ సభ్యులే.!



మహిళా ఆర్థిక, సామాజిక అభ్యున్నతికే స్వయం సహాయక సంఘాలు



- కొత్తగా 60 ఏళ్లు దాటిన వారిని కూడా సభ్యులుగా చేర్చుకునేందుకు చర్యలు
- తొలగింపునకు అడ్డుకట్ట
- కొత్త సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

సాక్షి,మేడ్చల్ జిల్లా: సమాజంలోని మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా సభ్యులు పేదరికాన్ని అధిగమించేలా 2002 నుంచి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కృషి చేస్తోంది. సంఘాల్లో చేరే సభ్యుల వయస్సును 18 నుంచి 60 ఏళ్లకు పరిమితం చేయడంతో మహిళలు అధిక సంఖ్యలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు దూరమవుతున్నారు. దీంతో పేదలను పేదరికం నుంచి విముక్తి చేసేందుకు సార్వత్రిక సామాజిక సమీకరణం (యూనివర్సల్ సోషల్ మొబిలైజేషన్) అనే ప్రధాన ఆశయం దెబ్బతింటోందని గ్రహించారు.

వృద్ధాప్యం అడ్డుకావొద్దని...

వయోపరిమితి, ఇతర కారణాలతో పొదుపు సంఘాల్లో సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. కనీస సంఖ్య లేని సంఘాలకు బ్యాంకు రుణాలు లభించని దుస్థితి నెలకొంది. దీంతో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు కూడా అవకాశం ఇవ్వాలని సంకల్పించారు. వృద్ధురాళ్లతో కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అన్ని జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖను ఆదేశించింది.

మూడు విభాగాలుగా...

60 ఏళ్లు నిండిన వారు, దివ్యాంగులు, 18 ఏళ్లు నిండిన మహిళలను గుర్తించి కొత్త సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. తక్కువ సభ్యులున్న సంఘాల్లో కొత్తవారిని చేర్పించడం, వృద్ధ, దివ్యాంగ మహిళలతో ప్రత్యేక స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఉన్న సంఘాల్లో 60 ఏళ్లు నిండిన వారిని, ఎప్పటికప్పుడు కొత్త సంఘాల్లో చేర్పడం లేదా 60 ఏళ్ల వయసున్న వారి సంఘాల్లో ఖాళీలుంటే వాటిలో భర్తీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇ(ఎల్డర్)ఎస్‌హెచ్‌జీ గుర్తింపు కోడ్‌తో సంఘాలను ఆన్‌లైన్‌లో చేర్చి, వీవోలో నమోదు చేస్తున్నారు.

తొలగింపులకు అడ్డుకట్ట...

కొన్ని చోట్ల సంఘాల ప్రతి నిధులు, గ్రామైక్య సంఘాలు, సమాఖ్యల సభ్యులను వివిధ కారణాలతో తొలగిస్తున్నట్లు గుర్తించారు. 10 మంది కంటే తక్కువగా ఉన్న ఏ సంఘం నుంచి సభ్యులను తొలగించేందుకు వీలులేని విధంగా ఎస్‌హెచ్‌జీ అకౌంటింగ్ యాప్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. వలసపోయిన, చనిపోయిన సందర్భాల్లో తప్ప ఇతర పరిస్థితుల్లో తొలగించడానికి ఇక వీలుండదు. పలు అంశాలను ప్రామాణికంగా తీసుకొని సంఘాల పనితీరుకు గ్రేడులు ఇస్తారు. రుణాలు, చెల్లింపుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ప్రస్తుతం ఉన్న సంఘాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 3,361 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో కీసర మండలంలో 656, ఘట్కేసర్‌లో 782, మేడ్చల్‌లో 769, మూడు చింతలపల్లిలో 526, శామీర్‌పేట్‌లో 623 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.

కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం..

60 ఏళ్లు దాటి, సభ్యులు కాని వారిని గుర్తించి వారితో సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. పొదుపు సంఘాల్లో చేరేందుకు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి వారితో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయిస్తున్నాం.

– పద్మజారాణి, గ్రామీణాభివృద్ధి అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నీటి సమస్యపై కమిషనర్ రాములు, డీఈ విజయలక్ష్మీతో కలిసి సమీక్ష నిర్వహించారు. రాబోయే మూడు నెలల పాటు ఎండలు ఎక్కువ ఉండటం నీటి సమస్యలు మరింతగా ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, ఈ సమస్య నివారణకు మిషన్ భగీరథతో పాటు మిగతా పాత వనరులను పునరుద్ధరించి అందరికి నీరు అందెలా చూడాలన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి 4.5 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతున్నాయని అన్నారు.45 బోర్లు పనిచేస్తున్నాయని అవసమైతే పాత వాటికి మరమ్మతులు చేయించి వాడకంలోకి తెస్తామన్నారు. ప్రజలకు నీటి కష్టాలు రాకుండా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగును పర్యవేక్షిస్తున్న పావనీయాదవ్

ఘట్‌కేసర్: కంటి వెలుగును పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 11వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మల్లేశ్‌తో కలిసి సోమవారం కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. మానవ శరీరంలో ప్రధానమైన కళ్లను అతి జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, పీహెచ్ఎన్ విమలరెడ్డి, అప్తమాలజిస్ట్ శిరీష, డీఈఓ సాత్విక్, సిబ్బంది విజయ, రాజేశ్వరీ, ఆశ వర్కర్లు లక్ష్మీ, మేఘమాల, జీఎంపీఎస్ అధ్యక్షుడు వీరేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

అభ్యాస్ స్టడీ మెటీరియల్ అందజేత

మేడ్చల్: గౌడవెల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నాయకులు అభ్యాస్ స్టడీ మెటీరియల్ అందజేశారు. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో వారికి పరీక్షల కోసం అభ్యాస్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, ఉప సర్పంచ్ పెంటమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ నరేందర్‌చారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మెటీరియల్‌ను అందజేస్తున్న నేతలు

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి
- ట్రెసా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళలు లేని రంగమంటూ లేదని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ విచ్చేసి మహిళా దినోత్సవ ప్రాముఖ్యత, మహిళా శక్తి విశిష్టతపై మాట్లాడారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలోని మహిళా ఉద్యోగులకు వివిధ రకాల క్రీడలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్, కార్యదర్శి వి.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.వాణి రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.సంయుక్త, ఉపాధ్యక్షురాళ్లు గౌరీవత్సల, ప్రసన్న, కార్యవర్గ సభ్యులు సంజీవరావు, పద్మప్రియ, అహల్య, సరిత, విజయలక్ష్మి, గీత, లావణ్య, సునీత, ప్రభుదాస్, కిరణ్, నాగజ్యోతి, సారిక, సుస్మిత, శశికళ తదితరులు పాల్గొన్నారు.


మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

అనురాగ్ యూనివర్సిటీలో..


కార్యక్రమంలో మాట్లాడుతున్న మనీషా సబూ

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హెచ్‌వైఎస్ఈఏ అధ్యక్షురాలు మనీషా సబూ హాజరై మాట్లాడుతూ.. జీవితంలో అవాంతరాలు ఎన్ని ఎదురైనా.. చక్కని ప్రణాళికతో ముందుకు సాగుతూ అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలన్నారు. లింగ వివక్ష లేకుండా పురుషులు అన్ని రంగాల్లో మహిళలకు తోడ్పాటు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏయూ ఉప కులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా, సీఈఓ సీలిమా, ఏయూ మహిళ సంక్షేమ కమిటీ కన్వీనర్ శ్రీదేవి, కోకన్వీనర్ శిరీష, మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ..

సాక్షి, మేడ్చల్ జిల్లా: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో జిల్లా మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని టీఎన్జీవోస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, విద్యావేత్త డాక్టర్ సరోజన బండ కేక్ కట్ చేశారు. ఈ వేడుకలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్, రాష్ట్ర, జిల్లా నాయకులు పాలబై ఈశ్వర్, రజిని, పద్మ, మారుతీ, నజీమా, జ్యోతి, అరుణ, అనిత, నాగలక్ష్మి, అన్నపూర్ణ, నిర్మలకుమారి, హైమావతి, యాదమ్మ, పుష్ప, విజయ, జ్యోతి, శిరీష, హరి, చంద్, జేమ్స్ దాస్, కిషోర్, రామచంద్రం పాల్గొన్నారు.


మహిళా దినోత్సవ కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మహిళల అభ్యున్నతికి కృషి : మంత్రి మల్లారెడ్డి


మహిళా దినోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

కీసర: మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టడమే కాకుండా మహిళలకు రాజకీయాలకు సంబంధించిన వివిధ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు కబడ్డీ, ఖోఖో, డాన్స్ తదితర పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ కాలనీల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సేవలో శంకరానంద సరస్వతి స్వామిజీ


అభిషేకం చేస్తున్న శంకరానంద సరస్వతి స్వామిజీ


స్వామిజీ ఆశీర్వాదం తీసుకుంటున్న ఆలయ చైర్మన్ రమేష్ శర్మ తదితరులు

కీసర: శ్రీశారదా దత్తపీఠం ఆధోని మఠం పీఠాధిపతి శ్రీశంకరానంద సరస్వతి స్వామిజీ కేసరగిరి కీసరగుట్ట క్షేత్రంలో కొలువుదీరిన శ్రీభవానీరామలింగేశ్వర స్వామి సేవలో సోమవారం పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన పీఠాధిపతి శంకరానంద సరస్వతి స్వామిని ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి ఆయన అభిషేక పూజ చేయగా అనంతరం ఆలయ పండితులు స్వామి వారి మహా ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్: భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంకు చెందిన చంద్రవంశీ(37) మూడేళ్ల క్రితం మేడ్చల్ ప్రాంతంకు వచ్చి భార్యతో కలిసి గౌడవెల్లిలో నివాసముంటూ అక్కడే మేస్త్రీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చంద్రవంశీ మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఆయన మద్యం సేవించి భార్యతో గొడవకు దిగి ఆ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తెల్లవారు చూసేసరికి మేడపై ఉన్న ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని కనిపించాడు. ఈ మేరకు వంశీ భార్య ఫిర్యాదుతో మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి: మంత్రి మల్లారెడ్డి


మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

జవహర్‌నగర్: ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్స్, రీడింగ్ యూనియన్ నాయకులు కార్పొరేటర్ ఏకే మురుగేష్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో కార్మికుల సంక్షేమానికి, భద్రతకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, దేశంలో ఎక్కడా లేని విధంగా కార్మికులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఆయన కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దులు యాదవ్, యూనియన్ నాయకులు వెంకటేష్, లక్ష్మణ్, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

'ప్రగతిశీల' పోస్టర్ ఆవిష్కరణ



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం ప్రగతిశీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు సరళ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళ కార్మికులకు కనీస వేతం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, నాయకులు ఫాతిమా, వెంకటమ్మ, ఐఎఫ్‌టీయూ నాయకులు శివబాబు పాల్గొన్నారు.

పేదల కంటి సమస్యలు తీర్చేందుకే 'కంటి వెలుగు'

మేడ్చల్: పేదల కంటి సమస్యల నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ప్రజలంత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. కోనాయిపల్లి గ్రామంలో కంటి వెలుగును ప్రారంభించి అవసరమైన వారు మందులు, కంటి అద్దాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశం, సర్పంచ్ శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోనాయిపల్లిలో కంటి వెలుగును ప్రారంభించిన ఎంపీపీ రజితరెడ్డి

దివ్యాంగులకు స్వయం ఉపాధి రుణాలు కల్పించాలి


ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

జవహర్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు కూడా ఉపాధి లోన్లు అందించాలని కోరుతూ తెలంగాణ వికలాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని దివ్యాంగులకు స్వయం ఉపాధి లోన్లు, మ్యారేజ్ లోన్, డబుల్ బెడ్రూమ్‌లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు శివకృష్ణ, నాయకులు సంపత్, రాజు, ప్రమీల, నాగరాజు, రంజిత్, రవి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ నిధులతో ఆలయం వద్ద నూతన బోరు


కట్ట మైసమ్మ ఆలయం వద్ద వేస్తున్న బోరు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ కట్టమైసమ్మ ఆలయం దగ్గర నీటి కొరత ఉందన్న భక్తుల విన్నపం మేరకు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి నిధులు మంజూరు చేశారు. జెడ్పీ చైర్మన్ ఇచ్చిన హామీ మేరకు సోమవారం ఆలయం సమీపంలో బోరు వేయించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, వార్డు సభ్యుడు ఆంజనేయులు ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, శేఖర్, బాలరాజ్‌ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, యుగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.